క్లుప్తంగా

రవాణా చార్జీలు చెల్లించాలి

పాలకొండ: రైతులు విక్రయించిన ధాన్యానికి సంబంధించి రవాణా చార్జీలు చెల్లించాలని రైతు సంఘ నాయకుడు బుడితి అప్పలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సీజన్‌లో సొంత ఖర్చులతో రైతులు ధాన్యం రవాణా చేసుకున్నారని పేర్కొన్నారు. దీంతో పాటు గోనెలకు సంబంధించిన డబ్బులను రైతుల ఖాతాలో జయ చేయాలని కోరారు.

ఈ నెల 17 నుంచి రేగాలమ్మ ఉత్సవాలు

గరుగుబిల్లి: మండలంలోని శివ్వాం గ్రామంలో రేగాలమ్మ ఉత్సవాలు ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించేందుకు గ్రామ కమిటీ సభ్యులు తీర్మానించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో సోమవారం అమ్మవారిని గ్రామంలోకి తోడ్కొని రావడం, మంగళవారం అమ్మవారి ఘటాల ఊరేగింపు, బుధవారం అనుపోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సంతాపం..


అప్పలనాయుడు మాష్టారు(ఫైల్)

వీరఘట్టం: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ హెచ్‌ఎం లెకం అప్పలనాయుడు (81) ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెట్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి తమ సంతాపాన్ని తెలియజేశారు. ఆ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

క్షీణిస్తున్న పారిశుధ్యం


అధ్వానంగా ఉన్న నగర పంచాయతీ కార్యాలయ పరిసరాలు

పాలకొండ రూరల్: నగరంలో రోజురోజుకూ పారిశుధ్యం క్షీణిస్తోంది. పట్టణంలో 20 వార్డుల్లో 180 వరకు వీధులుండగా ఎక్కడ చూసినా చెత్తాచెదారాలే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వీధి కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన చెత్త సేకరణ తొట్టెలు పూర్తిగా పాడయ్యాయి. దీంతో చెత్త, వ్యర్థాలు రోడ్డు మీదే పడేస్తున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నేటి నుంచి నీలావడి అగ్నిగంగమ్మ జాతర


నీలావడి అగ్నిగంగమ్మ

పార్వతీపురం రూరల్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న నీలావడి అగ్నిగంగమ్మ అమ్మవారి జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో ఉన్న నీలావడి గ్రామానికి ఒడిశాతో పాటు ఉత్తరాంధ్రలో ఉన్న పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకోనున్నారు. ఈనెల 10 నుంచి 18వ తేదీవరకు అగ్నిగంగమ్మ జాతరను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు.

ఆర్‌టీసీ డీఎం బాధ్యతల స్వీకరణ

సాలూరు: పట్టణంలో ఆర్టీసీ డీఎంగా బీఎస్ఎన్ మూర్తి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన కు ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలికారు. గత డీఎం భాస్కరరెడ్డి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పార్వతీపురంరూరల్: పార్వతీపురం మండలంలోని నర్సిపురం గ్రామానికి చెందిన పి.రాము గత నెల 22 నుంచి ఆచూకీ లేకపోవడంతో పార్వతీపురం రూరల్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై బి.సంతోషి తెలిపారు.

● ఎల్లమ్మకు ముర్రాటలు..



భామిని మండలం నేరడి – బి గ్రామంలో వెలసిన సిరుల ఎల్లమ్మను అధిక సంఖ్యలో భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. ముర్రాటలతో అమ్మవారికి చల్లదనం చేశారు. అలాగే పలువురు భక్తులు ఆలయంలో అరటిగెలలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. – భామిని

● ప్రవేశాలకు రాతపరీక్ష ..



గిరిజన గురుకులం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా కళాశాలలు, పాఠశాలల్లో 8వ తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశాలకు ఆదివారం స్థానిక ఏపీఆర్ బాలికల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 8వ తరగతిలో ప్రవేశానికి రాతపరీక్షకు 65 మందికి గాను ఏడుగురు గైర్హాజరయ్యారు. ప్రథమ ఇంటర్మీడియట్‌కు గాను 347 మంది విద్యార్థులకు 325 మంది పరీక్షకు హాజరయ్యారు. చీఫ్ సూపరెంటిండెంట్‌గా అరుణ్‌జ్యోతి, అబ్జర్వర్‌గా శ్రీరామమూర్తి వ్యవహరించారు. – సీతంపేట

● రక్తదానానికి ముందుకు రావాలి..



యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని డీఎస్పీ ఎం.రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రక్తదానం చేయడంతో పాటు రక్తదానం చేసిన యువతను అభినందించారు. ఎస్సై ప్రయోగమూర్తితో పాటు 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి, పోలీస్‌సిబ్బంది, ఏరియా ఆస్పత్రి వైద్యుడు చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు. – పాలకొండ


వండువ సమీపంలో రోడ్డుపై గుంతలు ఉండడంతో ఓ పక్క నుంచి వెళుతున్న వాహనదారులు


వండువ సమీపంలో మరో చోట రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత

మరీ ఇంత అధ్వానమా..!

సంక్రాంతి పండగ లోపు రోడ్లన్నీ బాగు చేస్తామని కూటమి నాయకులు ఎంతో గొప్పగా చెప్పుకున్నారు. తీరా పండగ వెళ్లిపోయి దాదాపు 50 రోజులు పూర్తి కావస్తోంది. అయినప్పటికీ మండల కేంద్రంలోని సీఎస్‌పీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. ఈ రోడ్డులో వండువ జంక్షన్ నుంచి నవగాం వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. ప్రతిరోజూ సెల్ఫ్ యాక్సిడెంట్లు అవుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించడం లేదు. రహదారి దుస్థితిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీఎస్‌పీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు. – వీరఘట్టం


నవగాం సమీపంలో మరో చోట రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత


నవగాం సమీపంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

యువత పోరుకు సన్నద్ధం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు డిమాండ్
- ఈ నెల 12న జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ధర్నా
- మాజీ ఎమ్మెల్యే కళావతి


మాజీ ఎమ్మెల్యే కళావతి, పక్కనే జెట్పీటీసీ సభ్యురాలు కన్నతల్లి

వీరఘట్టం: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్న కూటమి సర్కారుపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మరో పోరాటానికి సిద్ధమవుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తెలిపారు. ఆదివారం ఆమె వండువలోని స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 12న జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న యువత పోరు ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 12న వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీరఘట్టం మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టి అక్కడి నుంచి పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి చేరుకుని కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. పేద కుటుంబాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. అమ్మఒడి, వసతి దీవెన, విద్యాదీవెన నిలిపివేసి విద్యార్థుల ఆశలపై కూటమి ప్రభుత్వం విషం కక్కుతోందన్నారు. విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.3,900 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. యువత పోరు కార్యక్రమంలో యువత, విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆమెతో పాటు వీరఘట్టం జెట్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి ఉన్నారు.

అర్ధ శతాబ్దం తర్వాత జ్ఞాపకాల ఒడిలో..



గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1974–75 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. యాభై ఏళ్ల తర్వాత వారంతా కలుసుకోవడంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి తమ తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సరదాగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. విద్య నేర్పిన గురువులు, చదువుకున్న బడికి ఎప్పుడూ రుణపడి ఉండాలని అన్నారు.
కార్యక్రమంలో డి.పారినాయుడు, సింహాచలం మాస్టారు, ఎస్.శివున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిరుల యాత్రకు పోటెత్తిన భక్తులు



వీరఘట్టం: మండల కేంద్రంలోని సాయినగర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న సిరుల యాత్ర ఆదివారంతో ముగిసింది. యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో చివరి రోజైన ఆదివారం భక్తులు పోటెత్తారు. ఎల్లమ్మ, పోతన్నలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్సై జి.కళాధర్ బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా గావుపండగ సంబరాలు

సీతానగరం: మండలంలోని సూరంపేటలో యాదవ కులస్థుల కుటుంబాలు నిర్వహించే గోవపండగ సంబరాలు ఆదివారం ముగిశాయి. యాదవ కులస్థులు ఆరాధ్య దైవంగా పూజించే గోవ(గంగమ్మ) పండగను నాగళ్ల కుటుంబీకుల ఆధ్వర్యంలో ఏడాది విడిచి ఏడాది వంతున నిర్వహిస్తారు. ఈ మేరకు నిర్వాహకుడు సురేష్ ఆధ్వర్యంలో ఇంటినుంచి ఆలయం వరకు యాదవ కులస్థుల పర్యవేక్షణలో తప్పెటగుళ్లతో కళాకారులు తిరువీధి చేశారు. అందరి సమన్వయంతో గంగమ్మ ఆలయానికి గ్రామ పెద్దలు నాగళ్ల అప్పయ్య, గంగరాజు, సత్తయ్య, సురేష్ అమ్మవారిని సాగనంపారు.

నేడు లక్ష్మీ గణపతి దేవాలయ వార్షికోత్సవం



సీతంపేట: మండల కేంద్రంలోని లక్ష్మీ గణపతి దేవాలయ 46వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు వేమకోటి సాయికృష్ణ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టిన అనంతరం అన్నదానం చేపడతామని పేర్కొన్నారు. అలాగే ఈ నెల 11వ తేదీన తిరువీధి కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

పార్వతీపురం రూరల్: పట్టణంలోని జగన్నాథపురానికి చెందిన ఆర్. దుర్గాప్రసాద్‌పై దాడిచేసిన ఐదుగురు వ్యక్తులను శిక్షించాలని బాధితుడి కుటుంబ సభ్యులు కోరారు. పట్టణంలోని దేవాంగుల వీధి కూడలి వద్ద ఈనెల 7న యువకుడిపై ఐదుగురు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన పాఠకులకు విదితమే. ఈ ఘటనకు సంబంధించి వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చి హల్‌చల్ చేస్తున్నాయి. దాడికి సంబంధించిన దృశ్యాలు కుటుంబసభ్యులు, స్నేహితులు చూసి చలించిపోయారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, స్నేహితులు కోరుతున్నారు.

విస్తృత పోరాటాల ద్వారానే మహిళలకు విముక్తి

సాలూరు: విస్తృత పోరాటాల ద్వారానే మహిళలకు విముక్తి కలుగుతుందని ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి, శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకురాలు రామలక్ష్మి అన్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళాదినోత్సవ సదస్సులో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో మహిళలపై జరుగుతున్న లింగ, వర్ణ అణిచివేత నిర్మూలన , మహిళా విముక్తి కోసం విస్తృత పోరాటాలు నిర్వహించి వాటిలో మహిళలను భాగస్వామ్యం చేయడం ద్వారానే జరుగుతుందన్నారు. మహిళలకు పని ప్రదేశాలలో నేటికీ భద్రత లేదని, ప్రతిచోటా ఏదో ఒక రూపంలో వేధింపులు జరుగుతూనే ఉన్నాయన్నారు. మహిళలంతా ఎక్కడ ఉన్నా ఐక్యంగా ప్రశ్నించే తత్వంతో ముందుకు నడవాలని పిలుపునిచ్చారు.

అభినందన


జ్ఞానప్రకాష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏలో డిప్యూటీ డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన యు.జ్ఞానప్రకాష్‌ను మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో పీఆర్‌టీయూ, ఆట ఉపాధ్యాయ సంఘాల నాయకులంతా ఆయనను ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. ఓ గిరిజన వ్యక్తికి ఉన్నతమైన పదవి రావడం పట్ల వారంతా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయనను దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సూర్యనారాయణ, సత్యనారాయణ, భూషణరావు తదితరులు పాల్గొన్నారు.

అరకును రెండు పార్లమెంట్ స్థానాలు చేయండి

గుమ్మలక్ష్మీపురం: అరకు పార్లమెంట్‌ను రెండు పార్లమెంట్ నియోజకవర్గాలుగా చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో ఆదివారం డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఏడు అసెంబ్లీ స్థానాలతో భౌగోళికంగా పాలనకు ఇబ్బందికరంగా ఉన్న అరకు పార్లమెంట్ స్థానాన్ని డీ-లిమిటేషన్‌లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా పార్లమెంట్ స్థానంగా, అల్లూరి సీతారామరాజు జిల్లా పార్లమెంట్ స్థానంగా విభజించాలని కోరారు. అలాగే విశాఖపట్నంలోనే గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయం ఏర్పాటు చేస్తే ఇక్కడ అధికంగా ఉన్న గిరిజనులకు ఉపయోగకరమన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై సంజీవ్, తదితరులు

సీతంపేట: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎస్సై సంజీవ్ అన్నారు. ఆదివారం స్థానిక వారపు సంత వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు నడపడానికి ఇవ్వవద్దన్నారు. లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. అలాగే సైబర్ నేరాలపై వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై శిరీషా పాల్గొన్నారు.

చర్యలు తప్పవు..


తనిఖీలు చేపడుతున్న పోలీసులు

పాలకొండ రూరల్: మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఈక్రమంలో డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఏఎస్సై నారాయణరావు అన్నారు. పాలకొండ – వీరఘట్టం రహదారిలో డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా బ్రీత్ ఎనలైజర్ ద్వారా తనిఖీలు చేపట్టి, మద్యం సేవించిన వారికి జరిమాన విధించారు.

నిర్బంధించడం సరికాదు..



తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా అమరావతి వెళ్తున్న అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకుని, వారిని నిర్బంధించడం సరికాదని సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి ఖండించారు. ఇదే విషయమై ఆయన కొమరాడ మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై నిలదీసేందుకు శాంతియుత పోరాటానికి సిద్ధమైన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను గుమడ రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు అడ్డుకుని వారిని పోరాటంలో పాల్గొనకుండా చేశారన్నారు. ఇది ప్రజాగొంతుకను నొక్కేయడమేనన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది అనురాధ, విజయలక్ష్మి, మంగమ్మ, గంగ తదితరులు పాల్గొన్నారు. –కొమరాడ

అప్రమత్తతే రక్ష!

- మూగజీవాల సంరక్షణలో అప్రమత్తం కావాలి
- వేసవి ఎండల బారినపడకుండా చూడాలి
- పోషకాహారంతో కూడిన దాణా పెట్టాలి
- గాలి, వెలుతురు వచ్చేలా పశుశాలలు నిర్మించాలి
- గుమ్మలక్ష్మీపురం పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు


పెంగవ గ్రామంలో మేత మేస్తున్న పశువులు

గుమ్మలక్ష్మీపురం: వేసవిలో పశు సంపద సంరక్షణ కష్టతరం. అయితే తగిన జాగ్రత్తలు పాటిస్తే మండు వేసవిలోనూ పశు సంపద పదిలమేనని స్థానిక పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు సూచిస్తున్నారు. వేసవి మూడు నెలల కాలంలో పశువులను చాలా జాగ్రత్తగా పెంచాలని, ముఖ్యంగా ఎండల బారినపడకుండా చూడాలంటున్నారు. దాణా దగ్గర నుంచి వాటిని ఉంచే శాలల(పశువుల పాకలు) వరకు అన్నింట్లోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని చెబుతున్నారు. కురుపాం నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో ఆవులు 83,954, గేదెలు 27,904, గొర్రెలు 35,412, మేకలు 58,457, కోళ్లు 2,54,317, పందులు 273 చొప్పున ఉన్నాయి.

నీటిలో తడిపిన గోనె సంచులు కట్టాలి..
పశువులు కట్టే పాకలు, శాలల్లో ఉష్ణోగ్రతను నియంత్రించే ఏర్పాట్లు చేయాలి. గాలి, వెలుతురు బాగా తగిలేలా పాకల ఏర్పాటు ఉండాలి. పాకలో ఉండే పశులకు చల్లని వాతావరణం కల్పించేందుకు పాక చుట్టూ నీటిలో తడిపిన గోనె సంచులు ఏర్పాటు చేయాలి. ఉష్ణోగ్రత తక్కువగా ఉన్న వాతావరణంలో పశువులు ఎక్కువ మేత తిని, ఆరోగ్యంగా ఉంటాయి. అంతేకాకుండా మంచి పాల దిగుబడి ఇస్తుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే వాటిని మేతకు బయటకు తీసుకువెళ్లాలి. నీరసించిపోతున్న పశువులకు ఫ్లూయిడ్స్ ఎక్కించాలి.

వడదెబ్బకు గురికాకుండా..
వేసవి ఎండల నేపథ్యంలో పశువులు వడదెబ్బ బారినపడకుండా చూసుకోవాలి. సాధారణంగా సంకరజాతి, హెచ్ఎఫ్ జెర్సీ ఆవులు 37 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఇబ్బంది పడతాయి. ఎండలకు శరీర ఉష్ణోగ్రత పెరిగి ఆ వేడిని అదుపులో ఉంచుకోవడానికి నోటి ద్వారా శ్వాస తీసుకుంటూ ఆయాస పడతాయి. దీంతో మేత తక్కువగా తినడం, ఆ తర్వాత నీరసించిపోవడం తద్వారా పాల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. ఒక్కోసారి ఎండలకు శరీరంలోని నీటి శాతం తగ్గి పశువులు మరణించే ప్రమాదమూ ఉంది.

చల్లని వేళల్లో మేతకు..
పశువులను ఉదయం, సాయంత్రం చల్లని వేళల్లోనే మేతకు తీసుకువెళ్లాలి. మేత కూడా రాత్రి లేదా చల్లని వేళల్లోనే వేయాలి. పచ్చిమేతగా పాతర, అజొల్లా, మొలక గడ్డి రూపంలో పచ్చగడ్డి అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. పచ్చిమేత, ఎండుగడ్డిని ముక్కలుగా చేసి మేపితే 30 శాతం గడ్డి వృథా కాకుండా చూడొచ్చు. వీలైతే పశువులను రోజులో రెండు మూడు సార్లు కడిగితే మంచిది.